


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 01-10-2026 సంపుటి : 08 సంచిక 101 పేజీలు : 8 వెల : రూ 3-00


## పేదల ఆత్మగౌరవానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న పట్టాభిషేకం

### పేదలకు పట్టాభిషేకం లో సీఎం చంద్రబాబు



విజయవాడ ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడలో పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోంది. ప్రజలు వేసిన ప్రతి ఓటుకూ న్యాయం చేస్తున్నాం. ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడుతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసస్తూ ముందుకు వెళ్తోందని అన్నారు.విశాఖపట్నంలో 28 వేల మందికి, మంగళగిరిలో 5,800 కుటుంబాలకు, ఇప్పుడు విజయవాడలో 26 వేల మంది కుటుంబాలకు పట్టాలు ఇస్తున్నాం. మొత్తం కలిపి 60 వేల మంది పేదలకు పట్టాలు ఇవ్వటం నా అదృష్టంగా భావిస్తున్నాను. రూ.52 వేల కోట్ల విలువైన భూముల్ని పేదలకు ఇవ్వటం సంతోషంగా ఉంది. పేదలకు జరుగుతున్న పట్టాభిషేకం ఇది. విజయవాడలో ఇస్తున్న భూముల విలువ రూ.28,112 కోట్లుగా ఉంది. ప్రతి ఒక్కరికీ సగటున 130 చదరపు గజాల స్థలం వచ్చింది. ఒక్కో స్థలం విలువ రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ ఉంటుంది. ఇదే పేదల ఆత్మగౌరవానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న పట్టాభిషేకం. దశాబ్దాలుగా పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి చలించి మీ స్థలాలకు హక్కుల కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పేదలకు పట్టాలు వచ్చేలా కృషి చేసిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు అభినందనలు తెలియచేస్తున్నా. గత పాలనలో ఐదేళ్ల పాటు విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం, ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం. పేదలకు కూడూ, గూడు, గుడ్డ అన్నది ఎన్టీఆర్ నినాదం అందులో భాగంగా 12,007 మందికి హక్కులు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నాం. 707 ఎకరాల్లోని 34 లక్షల చదరపు గజాల స్థలానికి పేదలకు హక్కులు కల్పించాం. ఇది మీ వారసత్వ హక్కు. భవిష్యత్తు కోసం జాగ్రత్తగా వీటిని కాపాడుకోవాలని అందరికీ పిలుపునిస్తున్నాను. దశాబ్దాలుగా ఉన్న సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. విశాఖ, వట్టిచెరుకూరు, కంగుమంది, కైకలూరు, అమలాపురం లాంటి చోట్ల ఉన్న ఈ తరహా సమస్యల్ని పరిష్కరించి పట్టాలు ఇచ్చాం. 2019-24లో గత పాలకులు ప్రతీ ఇంట్లోనూ ఆస్తుల వివాదాలు సృష్టించారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై వారి బొమ్మలేసుకున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ఇబ్బందులు సృష్టించారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. సర్వేరాళ్లపై బొమ్మలు వేసుకోడానికి రూ.800 కోట్లు ఖర్చు చేశారు. ఆ డబ్బులు ఉంటే పేదలకు మరింత సంక్షేమం జరిగేది. రాష్ట్రంలో భూములన్నిటిని రీసర్వే చేసి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. ఎలాంటి వివాదాలు లేని కొత్త వ్యవస్థను తీసుకువచ్చేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు.

## దేశంలో పునరుత్పాదక ఇంధన రంగాని ఊతం..

### రూ.1,86,405 కోట్ల నిధులు



ఢిల్లీ, సెప్టెంబర్ 30: దేశంలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఇవాళ ఢిల్లీలో సమావేశమైన కేంద్ర క్యాబినెట్ 'పీఎమ్ ధార'పథకానికి ఆమోదం తెలిపింది. ఈ భారీ ప్రాజెక్టు కోసం రూ.1,86,405 కోట్ల నిధులు కేటాయించారు.సోలార్ లేదా విండ్ ప్లాంట్లు సాధారణంగా నగరాలకు దూరంగా (ఎడారులు లేదా మైదాన ప్రాంతాల్లో) ఉంటాయి. అక్కడ తయారైన కరెంట్ని అక్కడే ఉంచలేం. దాన్ని మన ఇళ్లకు, పరిశ్రమలకు చేర్చాలంటే భారీ ట్రాన్స్మిషన్ లైన్లు (విద్యుత్ తీగలు), సబ్-స్టేషన్లు, గ్రిడ్ వ్యవస్థ కావాలి. అక్కడ ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌లోకి సురక్షితంగా తరలించడాన్ని 'పవర్ ఎవాక్యుయేషన్' అంటారు. ఇందుకోసం భారీ విద్యుత్ లైన్లు, గ్రిడ్‌లు, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌ను దేశవ్యాప్తంగా నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ భారీ మొత్తాన్ని ఖర్చు చేస్తుంది.వ్యవసాయం, పట్టణ రవాణా రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కేంద్ర మంత్రి మండలి రూ.2,79,157 కోట్ల (సుమారు రూ.2.79 లక్షల కోట్లు) విలువైన మూడు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు.

రబీ పంటలకు సవరించిన మద్దతు ధరలు (2027-28)

రబీ మార్కెటింగ్ సీజన్ 2027-28కి గానూ ఆరు ప్రధాన రబీ పంటలకు కనీస మద్దతు ధరలను (ఓఎస్‌పీ) పెంచుతూ కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని ద్వారా రైతులకు దాదాపు రూ. 90,962 కోట్ల లబ్ధి చేకూరనుంది.పంటల వారీగా కొత్త ఓఎస్‌పీ ధరలు (క్వింటాలుకు)గోధుమలు : రూ.2,610 (గతంలో రూ.2,585 ? రూ.25 పెంపు)బార్లీ : రూ.2,286 (రూ.136 పెంపు)శనగలు : రూ.5,958 (రూ.83 పెంపు)మసూర్ పప్పు : రూ.7,390 (రూ.390 పెంపు)ఆవాలు/రైప్ సీడ్ : రూ.6,613 (రూ.413 పెంపు)కుసుమలు : రూ.7,215 (అత్యధికంగా రూ.675 పెంపు)తృణధాన్యాల కంటే నూనెగింజలు, పప్పుధాన్యాలకు ఎక్కువ మద్దతు ధరలు ప్రకటించి రైతులకు పంట మార్పిడి వైపు ప్రోత్సాహం అందించడం ఈ నిర్ణయం యొక్క ముఖ్య ఉద్దేశం.'పీఎమ్ ధార' రూ.1,86,405 కోట్లుదేశంలో పునరుత్పాదక ఇంధన వ్యాప్తిని వేగవంతం చేసేందుకు పథకానికి కేబినెట్ రూ.1,86,405 కోట్లు కేటాయించింది.గ్రీన్ ఎనర్జీ కారిడార్ ద్వారా 135 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని గ్రిడ్‌కు అనుసంధానించడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు రాకుండా 50 ఉచిష్ట సామర్థ్యంగల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ఏర్పాటు చేయడం ఈ పథకం లక్ష్యం.ఢిల్లీ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ రూ.1,790 కోట్లుదేశ రాజధాని ఢిల్లీ పరిధిలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎటీఎస్) కోసం రూ. 1,790 కోట్లు కేటాయించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), స్మార్ట్ సిగ్నల్స్ ద్వారా ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో రవాణా రద్దీని తగ్గించి రోడ్డు భద్రతను పెంచనున్నారు.

## యువతకు ఉద్యోగాల కల్పనే మా ఏకైక ఎజెండా

### ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్ 2026లో ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

కొచ్చి (కేరళ): యువత మమ్మల్ని అడుగుతున్న ఒకే ఒక్క విషయం ఉద్యోగాల కల్పన. అందుకే మా ప్రభుత్వం ఉద్యోగాల కల్పనే ప్రధాన ఎజెండాగా పెట్టుకుంది. ముఖ్యమంత్రి నుంచి చివరి స్థాయి ఉద్యోగి వరకు అందరూ ఉద్యోగాల సృష్టిపైనే పనిచేస్తున్నారు. యువత కలల సాకారం కోసమే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం నిర్ణయించామని ఏపీ విద్య,ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్ 2026లో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్ దీప్ సర్దేశాయ్ అధిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలిచ్చారు. డీఎస్సీపై రాజకీయ నిరుద్యోగులే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు, వాస్తవానికి వారు ఆరోపిస్తున్న స్పోర్ట్స్ సర్టిఫికెట్లన్నీ గత వైసీపీ ప్రభుత్వంలో జారీచేసినవేనన్నారు. క్వాంటమ్ అనేది ఊహ కాదు, నెక్ట్స్ జెనరేషన్ టెక్నాలజీ. ఆంధ్రప్రదేశ్ దాన్ని అందిపుచ్చుకుంది. తొలి 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నాం. దానిపై పరిశోధనలు, మెటీరియల్ సైన్స్, క్రయోజెనిక్ టెక్నాలజీ వంటి



రంగాల్లో పని చేసి క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలనుకుంటున్నామని చెప్పారు. తాను క్రికెట్ చూడటానికి వెళ్లినపుడు కూడా పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపి పెట్టుబడులు రాబట్టినట్లు మంత్రి లోకేష్ తెలిపారు.

## స్వర్ణాంధ్ర విజన్ - 2047 లక్ష్యంగా ఏపీ ముందుకెళ్తోంది: గవర్నర్ కంభంపాటి



ప్రకాశం జిల్లా, సెప్టెంబర్ 30 : స్వర్ణాంధ్ర విజన్ - 2047 లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుకెళ్తుందని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు వ్యాఖ్యానించారు. 100 స్మార్ట్ సిటీల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ఒంగోలు అభ్యున్నతిలో భాగస్వాములైన ప్రతి పౌరుడికి హృదయపూర్వక అభినందనలు, ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రకాశం జిల్లాతో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధం, ఈ వేడుకను మరింత ప్రత్యేకంగా నిలుపుతోందని చెప్పుకొచ్చారు.ప్రకాశం జిల్లాలోని ఒంగోలు మున్సిపాలిటీ శతాబ్దిన్నర ఉత్సవాలను ఈరోజు (బుధవారం) ఘనంగా నిర్వహించారు. ఒంగోలు మినీ స్టేడియంలో జరిగిన ఉత్సవాలకు వెంకయ్య నాయుడు, కంభంపాటి హరిబాబు, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ కంభంపాటి హరిబాబు మాట్లాడారు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా, ప్రజల మధ్యకు రావడం, తనకు మళ్లీ స్వగ్రామానికి వచ్చినంత ఆనందాన్ని కలిగిస్తోందని వెల్లడించారు. ప్రకాశం గడ్డ, తన చరిత్రతో, సంస్కృతితో, ప్రజల కార్యదక్షతతో, దేశానికి అందించిన మహనీయులతో ఎల్లప్పుడూ ప్రత్యేకమైన గుర్తింపును కలిగి ఉందని తెలిపారు.ఎగ్జిబిషన్‌లో ప్రకాశం జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన ప్రజా ప్రతినిధులందరి ఫొటోలు కూడా పెట్టారని... ఇది చాలా సంతోషకరమైన విషయమని గవర్నర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. ఒంగోలు చరిత్రను కేవలం పురపాలక ప్రస్థానంగా పరిమితం చేయలేమని చెప్పారు. 2000 ఏళ్ల పైబడిన ఘనమైన చారిత్రక వారసత్వం కలిగిన ఈ పుణ్యభూమి, ప్రాచీన రాజవంశాల పాలనా వైభవానికి, నాగరికత వికాసానికి, సంస్కృతి సంప్రదాయాల ఔన్నత్యానికి ప్రతీకగా నిలిచిందని ఉద్ఘాటించారు. కాల గమనంలో ఇది ఓ ముఖ్యమైన పరిపాలనా కేంద్రంగా రూపుదిద్దుకుని, విద్య, వైద్యం, ప్రజాసేవ రంగాల్లోనూ తనదైన స్థానాన్ని సుస్థిరం చేసుకుందని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం, ఆనాడు వెంకయ్య నాయుడు పట్టణ అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు, చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఆ స్వచ్ఛత, తాగునీటి భద్రత, మురుగునీటి నిర్వహణ, జలవనరుల పరిరక్షణ, గృహ వసతి, వంటి కీలక రంగాలకు విశేష ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు.స్వచ్ఛ భారత్ మిషన్, అర్బన్, అమృత్ 2.0, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, అర్బన్ 2.0 వంటి కార్యక్రమాల ద్వారా, పట్టణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా అనేక చర్యలు చేపడుతోందని గవర్నర్ కంభంపాటి హరిబాబు తెలిపారు.

## రైతు బజార్లలో కిలో ఉల్లి రూ.35.. ఒక్కో కార్డుదారుడికి 2 కిలోల పంపిణీ: మంత్రి నాదెండ్ల

విజయవాడ, సెప్టెంబర్ 30 : ఏపీలోని రైతు బజార్లలో ఉల్లిపాయలను కిలో రూ.35లకు అందించే కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం చేపట్టిందని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఇవాళ విజయవాడలోని ఏఐసీసీ కాలనీ రైతు బజార్‌లో ఉల్లిపాయల పంపిణీని మంత్రి ప్రారంభించారు. ఒక్కో రేషన్ కార్డుదారుడికి రెండు కిలోల చొప్పున ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.కూటమి ప్రభుత్వంలో ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి నాదెండ్ల ఉద్ఘాటించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిణామాలతో ధరలు పెరుగుతున్నాయని వివరించారు. ప్రజలపై భారం పడకుండా సబ్సిడీపై అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. ధరల స్థిరీకరణకు నిధిని ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నామని తెలిపారు. బియ్యం, ఉల్లి, పప్పులు సబ్సిడీపై అందించేలా ఏర్పాట్లు చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.




# లోకల్ బాడీ ఎన్నికలు యధాతధం




విజయవాడ, సెప్టెంబర్ 30 స్థానిక ఎన్నికలపై ఎన్నికల సంఘం ఒక క్లారిటీ ఇచ్చింది. ఎన్నికలు ఇంకో రెండు నెలలు ఆలస్యం అవుతాయనే వార్తలను ఖండించింది. పుకార్లను నమ్మొద్దని ప్రజలను కోరింది. స్థానిక ఎన్నికలకు సంబంధించి ఏ సమాచారమైన మీడియా సమావేశం ద్వారా వెల్లడిస్తామని పేర్కొంది. సోషల్ మీడియాలో వస్తున్న సమాచారాన్ని నమ్మే ముందు.. సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న వివరాలతో ధ్రువీకరించుకోవాలని సూచించింది. అలాగే స్థానిక ఎన్నికలపై పుకార్లు సృష్టించినా, ఫార్వార్డ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.ఏపీ స్థానిక ఎన్నికలపై ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ మరో రెండు నెలలు ఆలస్యం అవుతుందనే వార్తలను ఖండించింది. ఈ పుకార్లలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఎన్నికల ఆలస్యంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని కొట్టిపారేసింది. ఇందులో ఏ మాత్రం నిజం లేదని తేల్చి చెప్పింది. ఈ ఫేక్ వార్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని తెలిపింది. ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్ల కోర్టు కేసులపై క్లారిటీ వచ్చాకే ప్రక్రియ ప్రారంభమవుతుందనే ప్రచారంలో నిజం లేదని ఏపీ ఎస్ఈసీ వెల్లడించింది. స్థానిక ఎన్నికలపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, ఇలాంటి కల్పిత సమాచారాన్ని ఇతరులకు పంపించ వద్దని ఎన్నికల సంఘం కోరింది.ఏపీ స్థానిక ఎన్నికల సమాచారాన్ని మీడియా సమావేశాల ద్వారా వెల్లడిస్తామని ఎన్నికల సంఘం స్పష్టంగా చెప్పింది. ఎన్నికల కమిషన్ పేరుతో కల్పిత, తప్పుదారి పట్టించే లేదా అనధికారిక సమాచారాన్ని పుట్టించినా, ఫార్వార్డ్ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించింది. సోషల్ మీడియా, వాట్సాప్‌ల ద్వారా వచ్చే మెసెజ్‌లను నమ్మే ముందు ఎస్ఈసీ అధికారిక వెబ్‌సైట్, అధికారిక ప్రకటనల ద్వారా సమాచారాన్ని ధ్రువీకరించుకోవాలని సూచించింది.ఏపీలో మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌ల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థలకు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలుస్తుంది. అయితే ఎన్నికల తేదీ, పూర్తి షెడ్యూల్ ఇంకా అధికారికంగా వెలువడ లేదు. కానీ ఇప్పటికే పట్టణాలు, పల్లెల్లో ఈ ఎన్నికల హాడావిడి కనిపిస్తుంది. రాజకీయ పార్టీలు కూడా స్థానిక ఎన్నికల కోసం సన్నాహాలు చేసుకుంటున్నాయి. కాగా గత 2021 మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ గెలుపొందింది. కార్పొరేషన్ వార్డుల లెక్కలోనూ ఆ పార్టీ ఆధిపత్యం సాధించింది. మరి 2026 స్థానిక ఎన్నికల్లో ఎవరిదీ పై చేయిగా ఉండబోతుందనే అంశం ఆసక్తికరంగా మారింది.

# అన్నాబత్తునికి బిగిస్తున్న ఉచ్చు



గుంటూరు, సెప్టెంబర్ 30 ,మాయ.. మంత్రం.. తంత్రం.. ఈ మూడు పదాలను ఆయన పాటించారు. బ్రహ్మాండంగా కోట్లు కొట్టేశారు. లేనిది ఉన్నట్టుగా భ్రమ కల్పించారు. మొత్తానికి మాయ చేసారు. కాకపోతే రోజులన్నీ ఒకే విధంగా ఉండవు కదా. అధికారంలో ఉన్నారు కాబట్టి అప్పట్లో ఎలా చేసినా చెల్లుబాటయింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అలాంటి అవకాశం కూడా లేదు. మొత్తంగా చూస్తే చేసిన మోసం.. సాగించిన వ్యవహారం అన్ని కళ్ళ ముందు కనిపిస్తున్నాయి.వైసీపీ మాజీ ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్ కు సంబంధించిన వ్యవహారంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఆయన మెడకు ఉచ్చు గట్టిగానే బిగిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే భూమికి సంబంధించిన వ్యవహారంలో పత్రాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఆయన రుణం తీసుకున్నట్టుగా చెబుతున్న ఏపీజే ఇంపెక్స్ అనే కంపెనీకి సంబంధించిన వ్యవహారాల విషయంలో కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నట్టు సమాచారం.విజయవాడ నగరంలో ఐకెఎఫ్ అనే ఫైనాన్స్ సంస్థ ఫిర్యాదు ఇచ్చిన నేపథ్యంలో తెనాలి ఒకటో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో కంపెనీకి సంబంధించిన చిరునామాలను పరిశీలించగా అక్కడ కంపెనీ కార్యాలయం బోర్డు.. ఇతర కార్యకలాపాలకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించలేదని విషయాన్ని పోలీసులు గుర్తించిన సమాచారం. పోలీసుల దర్యాప్తులో భాగంగా ఏపీజే ఇంపెక్స్ పేరుతో సుమారు మూడు కోట్ల రుణాన్ని శివకుమార్ 2019లో తీసుకున్నారు. రుణం పొందిన తర్వాత బ్యాంకు ఖాతాలలో జరిగిన లావాదేవీలు.. ఇతర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. లోన్ తీసుకున్న తర్వాత కంపెనీ పేరుతో శివకుమార్ వ్యాపార కార్యకలాపాలు సాగించలేదా.. కేవలం డబ్బు పొందడానికి మాత్రమే కంపెనీ పేరును ఉపయోగించారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.. అయితే ఈ అంశాలకు సంబంధించి తృది నిర్ధారణ ఇంకా రావాల్సి ఉంది. అయితే ఈ కంపెనీ ద్వారా ఎటువంటి కార్యకలాపాలు సాగించారు.. రుణం ఎలా తీసుకున్నారు.. దానికి ఎటువంటి పత్రాలు సమర్పించారు.. అనే విషయాలు దర్యాప్తు పూర్తయిన తర్వాత వెలుగులోకి వచ్చే అవకాశం ఉందిఈ కేసులో కంపెనీ నిర్వహణ.. లోన్ తీసుకోవడానికి సమర్పించిన పత్రాల వంటి వాటి మీద పోలీసులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. గతంలో భూమికి సంబంధించిన సర్వే వివరాలు.. ఎన్ కంబరెన్స్ సర్టిఫికెట్లు.. వంటి పత్రాల మీద అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే వాటిని ఎవరు జారీ చేశారు.. ఎటువంటి ఆధారాలతో వాటిని ధ్రువీకరించారు.. సంబంధిత అధికారులు వాటి మీద సంతకాలు ఎలా పెట్టారు.. వంటి అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా తెనాలి పురపాలకం.. కొత్తపేట సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారు.ప్రధానంగా ఏపీజే ఇంపెక్స్ కంపెనీ మీదనే ఇక్కడ ప్రశ్నలు వినిపిస్తున్నా. రిజిస్ట్రేషన్ చేసిన సమయంలో పేర్కొన్న కంపెనీ చిరునామా.. కార్యాలయం చేస్తున్న కార్యకాలపాలు.. బ్యాంకు ద్వారా సాగించిన లావాదేవీలు.. ఆడిట్ వ్యవహారాలు.. లోన్ తీసుకున్నప్పుడు సమర్పించిన ఆస్తి పత్రాలు.. ఇలా అన్ని అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.. ఒకవేళ పత్రాలలో పొందుపరచిన చిరునామాలలో కంపెనీ గనుక కార్యకలాపాలు సాగించలేదని తేలితే ఈ అంశం అత్యంత కీలకంగా మారుతుంది.కంపెనీ.. రుణం మంజూరు వంటి వాటికి పత్రాలు జారీ చేసిన నేపథ్యంలో వాటికి ప్రభుత్వ ధృవీకరణలు ఉన్నాయా.. ఎటువంటి వాటిని అమలు చేశారు.. వాటి వెనుక ఉన్న రికార్డులు ఏమిటి.. అనే అంశాల మీద పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.. ఒకవేళ ఆ పత్రాలు నకిలీవి అయితే.. అప్పుడు ఏం చర్యలు తీసుకోవాలో కూడా పోలీసులు ఆలోచిస్తున్నారు..

# 10 నెలల ముందే వీఆర్ఎస్

తిరుపతి, సెప్టెంబర్ 30 ఏపీఎస్ఆర్టీసీలో ప్రభుత్వ అధికారి వీఆర్ఎస్ (స్వచ్ఛంద పదవీ విరమణ) కోసం దరఖాస్తు చేయం ఆసక్తికరంగా మారింది. ఏపీఎస్ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో ఆపరేషన్స్ విభాగం ఈడీ రాఘవకుమార్ వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆయన మరో 10 నెలల పాటూ సర్వీస్ ఉంది.. కానీ వారం క్రితం ఆయన ఉన్నట్టుండి వీఆర్ఎస్ కోసం దరఖాస్తు చేశారు. గతంల ఆయన సుధీర్ఘంగా స్టోర్స్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహించారు. కొన్ని నెలల క్రితం రాఘవకుమార్‌కు ప్రమోషన్ దక్కింది.. కడప జోన్ ఆర్టీసీ ఈడీగా కీలక బాధ్యతలు అప్పగించారు. ఇంతలో ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో ఆపరేషన్స్ విభాగంగా ఈడీగా ఉన్న అధికారి పదవీ విమరణ చేయడంతో.. ఆయన స్థానంలో రాఘవకుమార్ కడప నుంచి బదిలీపై ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి వచ్చి రెండు నెలలుగా పనిచేస్తున్నారురాఘవకుమార్ వీఆర్ఎస్ తీసుకోవడానికి కారణం ఏంటనే చర్చ జరుగుతోంది. రెండు నెలలుగా క్రితం ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి వచ్చిన వ్యక్తి ఇంతలోనే వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవడం హాట్‌టాపిక్ అవుతోంది. రాఘవకుమార్ మాత్రం వ్యక్తిగత కారణాలతోనే తాను వీఆర్ఎస్ తీసుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆర్టీసీ ఇంఛార్జ్ ఎండీ ఉన్న రవాణాశాఖ కార్యదర్శి కోన శశిధర్, జాయింట్ ఎండీ శివప్రసాద్ కొత్తగా రాబోతున్న విద్యుత్ బస్సుల అంశంపై ఫోకస్ పెట్టారు. ఈ కొత్త విద్యుత్ బస్సులను ఏయే డిపోలకు కేటాయించాలి.. ఏ రూట్లలో నడపాలనే సమాచారాన్ని ఆపరేషన్స్ విభాగం అందజేయాల్సి ఉంటుంది. ఈ ఆపరేషన్స్ విభాగానికి రాఘవకుమార్ ఈడీగా ఉన్నారు. అయితే ఆయనకు పూర్తి సమాచారం రాలేదని కూడా తెలుస్తోంది. మొత్తం మీద ఆర్టీసీ ఈడీ రాఘవకుమార్ వీఆర్ఎన్ ఎపిసోడ్ ఆసక్తికంగా మారింది.ఏపీలో ఇటీవల తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మొత్తం 2,405 కి.మీ రోడ్లు దెబ్బతిన్నాయని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. వీటిలో అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలోనే 412 కి.మీ. మేర ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. 36 చోట్ల రోడ్లు కోతకు గురికాగా, 9 చోట్ల గండ్లు పడ్డాయన్నారు. ఆయా ప్రాంతాల్లో తాత్కాలికంగా పునరుద్ధరణ పనులు చేశామన్నారు. మొత్తంగా దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక పనులకు రూ.162.09 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ పనులకు రూ.1336.83 కోట్లు కలిపి మొత్తం రూ.1,498.92 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. అంతేకాదు తీవ్ర వాయుగుండం ప్రభావంతో 1,13,034 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనాల్లో గుర్తించామన్నారు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు.

# పల్లె పండుగ 3.0

నెల్లూరు, సెప్టెంబర్ 30వైసీపీ ఐదేళ్ల హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై, కనీస రహదారుల నిర్వహణ లేక రాష్ట్రంలోని పల్లెలు తీవ్ర అంధకారంలోకి వెళ్లిన సమయంలో పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. నిధుల కేటాయింపులు, పారదర్శక పాలన , స్వర్ణ పంచాయతీ పోర్టల్ వంటి విప్లవాత్మక సంస్కరణలతో ఆగిపోయిన నిధులను పంచాయతీలకు మళ్లించి వ్యవస్థకు కొత్త ఊపిరి పోశారు. ఆయన పట్టుదలతో శాఖలో పనులు వేగవంతమై, గతంలో ఎన్నడూ లేని విధంగా 13,218 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నిర్వహించి ప్రపంచ రికార్డు సృష్టించడం పవన్ కళ్యాణ్ నాయకత్వ పటిమకు నిదర్శనంగా నిలిచింది.పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన అపూర్వమైన చర్యలతో రాష్ట్రవ్యాప్తంగా గుంతలమయమైన రహదారులకు మహర్దశ పడుతోంది. ఉపాధి హామీ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, గత పల్లె పండుగ 1.0, 2.0 విడతల్లో వేలాది కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్లను, మినీ గోకులాలు , ఇతర మౌలిక వసతులను రికార్డు సమయంలో పూర్తి చేసి పవన్ కళ్యాణ్ తమ శాఖ సామర్థ్యాన్ని నిరూపించారు. గ్రామీణ ప్రాంత ప్రజల రవాణా కష్టాలను తీర్చడమే ధ్యేయంగా, ప్రాధాన్యత క్రమంలో అన్ని ప్రధాన రహదారులను సురక్షితంగా మార్చేందుకు ఆయన ప్రణాళికాబద్ధంగా అడుగులు వేశారు.ఈ దిశగా పంచాయతీరాజ్ శాఖను మరింత పరుగులు పెట్టిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో ప్రతిష్టాత్మక పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ. 11,085 కోట్ల భారీ నిధులతో గ్రామీణ రూపురేఖలను మార్చేలా డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో మౌలిక సదుపాయాల విప్లవానికి తెరలేపారు. గ్రామీణ పేదరికం నిర్మూలనతో పాటు మౌలిక వసతుల కల్పనలో పంచాయతీరాజ్ శాఖ శరవేగంగా నిర్ణయాలు తీసుకోవడం పవన్ విజన్‌కు అద్దం పడుతోంది.ఈ పల్లె పండుగ 3.0 ద్వారా పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖ ఏకంగా 15,500 కిలోమీటర్ల మేర రవాణా సౌకర్యాలను విస్తరించనుంది. ఇందులో రూ. 7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు, రూ. 2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. వీటితో పాటు పాడి రైతుల కోసం రూ. 300 కోట్లతో 22,000 మినీ గోకులాలు, రూ. 225 కోట్లతో ఉద్యాన పంటల పెంపకం, రూ. 110 కోట్లతో మ్యాజిక్ డ్రెయిన్లు , రూ. 200 కోట్లతో పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ, నిరంతర పర్యవేక్షణతో పంచాయతీరాజ్ శాఖ నేడు దేశంలోనే నంబర్ వన్ స్థానానికి దిశగా అడుగులు వేస్తోంది.

# ఓవర్‌డ్రాఫ్ట్ సంక్షోభం నుంచి స్వయం సమృద్ధి దిశగా ఏపీ !

విజయవాడ,సెప్టెంబర్ 30,ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ గత రెండేళ్లలో విప్లవాత్మకమైన మార్పును సాధించింది. నిత్యం ఓవర్‌డ్రాఫ్ట్‌పై ఆధారపడే దయనీయ పరిస్థితి నుంచి సొంత కాళ్లపై నిలబడే స్వయం సమృద్ధి స్థాయికి రాష్ట్ర ఆర్థిక శాఖ చేరుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ, నిధుల వినియోగంలో పాటిస్తున్న విచక్షణ రాష్ట్ర ఆర్థిక మూలాలను పటిష్టం చేశాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా ఖజానా నిర్వహణకు, ఉద్యోగుల జీతభత్యాల కోసం ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకోవడం సర్వసాధారణంగా మారగా.. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందనడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారిక నివేదికలే అద్దం పడుతున్నాయి.ఆర్బీఐ విడుదల చేసిన ఫైనాన్షియల్ అకామడేషన్ అవైల్డ్ బై స్టేట్ గవర్నమెంట్స్ గణాంకాల ప్రకారం.. 2026 ప్రారంభ నెలల్లో ఏపీ ఆర్థిక క్రమశిక్షణ ఎంత వేగంగా పుంజుకుందో స్పష్టంగా తెలుస్తోంది. 2026 ఏప్రిల్ నెలలో రాష్ట్రం ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయాన్ని కేవలం ఒక్క రోజు మాత్రమే వినియోగించుకోగా , ఆ తర్వాతి నెల అయిన మే-2026 నాటికి ఓవర్‌డ్రాఫ్ట్ రోజుల సంఖ్య జీరోకు పడిపోయింది. అంటే మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఓడీ తీసుకోకుండా తన అవసరాలను స్వయంగా తీర్చుకోగలిగింది. దేశంలో పలు ఇతర రాష్ట్రాలు ఇప్పటికీ భారీగా ఓడీ, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులపై ఆధారపడుతుండగా.. ఆంధ్రప్రదేశ్ మాత్రం నెల రోజుల్లోనే ఓడీ రహిత రాష్ట్రంగా నిలవడం విశేషం.కేవలం ఓవర్‌డ్రాఫ్ట్ మాత్రమే కాకుండా, తాత్కాలిక నగదు కొరతను అధిగమించేందుకు తీసుకునే వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ వినియోగం కూడా గణనీయంగా తగ్గిపోయింది. 2026 ఏప్రిల్ నెలలో 8 రోజుల పాటు సగటున రూ.1,996 కోట్ల చొప్పున డబ్ల్యూఎంఏ తీసుకోగా.. మే నెల నాటికి అది సగానికి సగం తగ్గి కేవలం 4 రోజులకు, సగటున రూ.466.25 కోట్లకు పరిమితమైంది. అలాగే ప్రభుత్వం తన వద్ద ఉన్న సెక్యూరిటీలను హామీగా ఉంచి తీసుకునే స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ కూడా ఏప్రిల్‌లో 25 రోజుల పాటు సగటున రూ. ?7,181 కోట్లు ఉండగా, మే నాటికి 21 రోజులకు, సగటు మొత్తం రూ.6,225.92 కోట్లకు తగ్గింది. ఆర్బీఐ సదుపాయాలపై ప్రభుత్వం క్రమంగా ఆధారాన్ని తగ్గించుకుంటూ వస్తోందనడానికి ఈ సంఖ్యలే నిదర్శనం.గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా చేసిన అప్పులు, అడ్డగోలు నిధుల మళ్లింపులతో రాష్ట్ర ఖజానా దివాళా అంచున నిలిచిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆదాయ వనరులను సమర్థవంతంగా సమీకరించుకుంటూ, అనవసర ఖర్చులకు కళ్లెం వేస్తూ ఆర్థిక నిర్వహణను పకడ్బందీగా చేపట్టింది. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూనే, అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ ఖజానాను స్వయం సమృద్ధి దిశగా నడిపించడంలో ఆర్థిక శాఖ విజయం సాధించింది. ఓవర్‌డ్రాఫ్ట్ అనే పదం వినపడకుండా సొంత రాబడులతో రాష్ట్ర రథాన్ని ముందుకు తీసుకెళ్తున్న ప్రస్తుత ఆర్థిక నిర్వహణే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రగతికి అసలైన వెన్నెముకగా నిలుస్తోంది.

# విశాఖలో మల్లారెడ్డి వర్శిటీ

విశాఖపట్టణం, సెప్టెంబర్ 30 తెలంగాణలో బలమైన ఇంజనీరింగ్, మెడికల్ , ప్రైవేట్ విశ్వవిద్యాలయ వ్యవస్థను నిర్మించిన బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి చామకూర మల్లా రెడ్డి.. ఇప్పుడు తన దృష్టిని ఆంధ్రప్రదేశ్ వైపు సారిస్తున్నారు. తెలంగాణలో మల్లా రెడ్డి యూనివర్సిటీ'తో పాటు డీమ్డ్ విశ్వవిద్యాలయ హోదాతో విద్యా రంగాన్ని ఏలిన మల్లా రెడ్డి గ్రూప్, ఆంధ్రప్రదేశ్‌లో తన విద్యా వ్యాపారాన్ని అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ఏపీలోని ప్రధాన నగరాలు, ఉమ్మడి జిల్లాలను లక్ష్యంగా చేసుకుని రీజినల్ క్యాంపస్‌లు, శాటిలైట్ క్యాంపస్‌లు , ఆఫ్-క్యాంపస్ సెంటర్ల ఏర్పాటుకు మల్లా రెడ్డి విద్యా సంస్థల యాజమాన్యం ప్రణాళికలను వేగవంతం చేసింది.ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా ఏపీ ఐటీ, ఆర్థిక రాజధాని విశాఖపట్నంలో మల్లా రెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ ఆఫ్-క్యాంపస్




పేరుతో భారీ ఆఫ్-క్యాంపస్ సెంటర్‌ను ఇప్పటికే ప్రారంభించారు. యూజీసీ అనుమతులతో ఏర్పాటు చేసిన ఈ క్యాంపస్‌లో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ విభాగాల్లో అత్యాధునిక కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. విశాఖతో పాటు రాజధాని అమరావతి పరిధిలోని విజయవాడ, గుంటూరు బెల్ట్‌తో పాటు రాయలసీమ కేంద్రమైన తిరుపతి, కర్నూలు జిల్లాల్లోనూ కొత్త క్యాంపస్‌ల నిర్మాణానికి భూముల సేకరణ, అనుమతుల ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నట్లు సమాచారం. తిరుపతిలో ఓ కాలేజీని కొని ఇప్పటికే ఆఫ్ క్యాంపస్ ను ప్రారంభించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల స్థాపనకు ఇస్తున్న ప్రోత్సాహకాలు మల్లా రెడ్డి గ్రూప్‌కు కలిసివస్తున్నాయి. తెలంగాణకు చెందిన వేలాది మంది ఏపీ విద్యార్థులు ప్రతిఏటా మల్లా రెడ్డి విద్యాసంస్థల్లో చేరుతున్నందున నేరుగా ఏపీలోని స్థానిక ప్రాంతాల్లోనే నాణ్యమైన మౌలిక వసతులతో క్యాంపస్‌లను అందుబాటులోకి తెస్తే డిమాండ్ మరింత పెరుగుతుందని యాజమాన్యం అంచనా వేస్తోంది. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఎఐ , డేటా సైన్స్, పారామెడికల్ . లైఫ్ సైన్సెస్ కోర్సులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఏపీ విద్యార్థులను ఆకట్టుకునే వ్యూహంతో అడుగులు వేస్తున్నారు.మల్లా రెడ్డి విద్యా సంస్థల ఈ అగ్రెసివ్ నెట్‌వర్క్ విస్తరణతో ఆంధ్రప్రదేశ్‌లోని సంప్రదాయ ప్రైవేట్ కాలేజీలు , కార్పొరేట్ విద్యా సంస్థలకు గట్టి పోటీ ఎదురుకాబోతోంది. పొలిటికల్ ఇమేజ్, బ్రాండ్ మార్కెటింగ్, తక్కువ రుసుములతో కూడిన హామీలు, ప్లేస్‌మెంట్స్ నెట్‌వర్క్‌ను చూపించి ఏపీ ఉన్నత విద్యా మార్కెట్‌లో తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవాలని మల్లా రెడ్డి గ్రూప్ చూస్తోంది.

# యువ క్రీడాకారులకు జ్యోతి సురేఖ స్ఫూర్తిదాయకం

## శాప్ ఛైర్మన్ రవి నాయుడు.

అమరావతి ఏషియన్ గేమ్స్ 2026లో భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టుకు స్వర్ణ పతకం లభించిది. ఫైనల్లో చైనాను 238?234తో ఓడించి భారత్ ఘన విజయం సాధించింది. జట్టులో భాగమైన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖకు ఇది ఏషియన్ గేమ్సో 4వ స్వర్ణ పతకం. జ్యోతి సురేఖతో పాటు భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టులో భాగమైన చికితా తనపర్తి మరియు ప్రతికా ప్రదీప్ కు శాప్ చైర్మన్ అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ ఆర్చరీ వేదికపై జ్యోతి సురేఖ తన ప్రతిభతో భారతదేశం మరియు ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. యువ క్రీడాకారులకు జ్యోతి సురేఖ స్ఫూర్తిదాయకమని అయన అన్నారు.

# 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన అవాస్తవ కథనంపై విజయవాడ పోలీసుల స్పందన

## లాయర్లపై లాఠీఛార్జ్ వార్త పూర్తిగా అవాస్తవం, వాస్తవ విరుద్ధం

## న్యాయవాదులు అంటే మాకు ఎంతో గౌరవం ఉంది.

విజయవాడమంగళవారం నాడు విజయవాడ సివిల్ కోర్టు ఆవరణలో న్యాయవాదులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారంటూ 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తలు పూర్తిగా అవాస్తవం, అభూతకల్పన. విజయవాడ నగర పోలీసు కమిషనరేట్ ఈ వార్తలను విజయవాడ పోలీసు కమిషనరేట్ తీవ్రంగా ఖండిస్తోందని ప్రకటన విడుదల చేసారు.కొంతమంది న్యాయవాదులు తమ డిమాండ్స్ పై నిరసన తెలిపే సమయంలో అదే రూట్ లో ముఖ్యమంత్రి జి+ కేటగిరీ కాన్వాయ్ పర్యటన ఉంది.ఈ సమయంలో విఐపి భద్రత, సాధారణ ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా వారిని కేవలం 2 నిమిషాలు ఆగాలని కోరినప్పటికీ, లాయర్లు బందర్ రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్కు ఆటంకం కలిగించారు.ఈ సమయంలో పోలీసులు వారికి నచ్చజెప్పి అంబేడ్కర్ స్మారక ద్వారం వద్దకు పంపగా వారు తమ వినతిపత్రం సమర్పించారు. ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న ఏ పోలీస్ అధికారి వద్ద గానీ, సిబ్బంది వద్ద గానీ ఎలాంటి లాఠీలు లేవు. అలాంటప్పుడు లాఠీఛార్జ్ చేసే ఆస్కారమే లేదు. న్యాయవాదుల పట్ల పోలీసులు ఎలాంటి దురుసు ప్రవర్తన చేయలేదు, లాఠీఛార్జ్ కూడా జరగలేదు. న్యాయవాదులు అంటే మాకు ఎంతో గౌరవం ఉందని వివరణ ఇచ్చారు.

## 3వ తేదీ శనివారం సూర్య దేవాలయంలో అనఘాష్టమి వ్రతం...



విభారే న్యూస్ సెప్టెంబర్ 30 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్తశ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజి దివ్య ఆశీస్సులతో 03-10-2026 తేదీన, శనివారము శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం నందు ఉదయం 9 గంటలకు శ్రీ గురు దత్తాత్రేయ స్వామి వారికి అనఘాష్టమి వ్రతం నిర్వహించబడును. ఈ పర్యాయము అనఘాష్టమి వ్రతము మహాళాయ పక్షములలో రావటము వలన అనఘా స్వామి కృపతో పితృ దోషాలు, రాహు-కేతు గ్రహ దోషాలు,సర్ప దోషాలు, కుజ దోషము నివారింపబడిపితృదేవతల అనుగ్రహము వలన కుటుంబ అభివృద్ధి జరుగును. సంప్రదించవలసిన ఫోన్ నెం:-ప్రద్యుమ్న కుమార్ శర్మ గుండంపాటి 9440616198గూగుల్ పే,ఫోన్ పే నెంబరు..8896123777..ఆఫీను ల్యాండ్ ఫోను నెంబరు..08518-234388

## నేడు కృతికా నక్షత్రం,రేపు షష్టి సందర్భంగా సుబ్రమణ్యస్వామికి విశేష పూజలు..

విభారే న్యూస్ సెప్టెంబర్ 30 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురు దత్త శ్రీ గురు దత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్య నారాయణ స్వామి దేవాలయంలో నేడు కృత్తిక (స్వామి వారి జన్మ నక్షత్రం)శుక్రవారం షష్ఠి కలసి ఉన్న శుభ సందర్భం అత్యంత యోగ దాయకం.. ఈ సందర్భంగా ఈ రెండు రోజులు శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి వారికి అత్యంత విశేషంగా పూజలు, అర్చనలు,సర్ప సూక్త విధానంగా పంచామృత అభిషేకాలు, కావడి సేవలు,కందుల హరతులు జరుగుతాయి. వివాహ సమస్యలు,భూ సమస్యలు,సంతాన సమస్యలు ఉన్నవారు ఈరోజు శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన ద్వారా తమ సమస్యలను దూరం చేసుకోగలరు..ఈ రెండు రోజులు స్వామి వారి ఆరాధన విశేష ఫలితాన్నిస్తుంది..భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు.అభిషేకం - 200/-,కావడి సేవ - 250/-, మాసపూజ -300/- నిత్య పూజ - 3000/-సంప్రదించవలసిన ఫోన్ నెం:-ప్రద్యుమ్న కుమార్ శర్మ గుండంపాటి :- 9440616198గూగుల్ పే ఫోన్ పే నెంబరు..8896123777 ఆఫీసు ల్యాండ్ ఫోను నెంబరు..08518-234388..



## మద్యం దుకాణాల దరఖాస్తుల్లో పారదర్శకత--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 30: మద్యం దుకాణాల లైసెన్స్ పునరుద్ధరణ, కొత్త దరఖాస్తుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి టి. నాగలక్ష్మి తెలిపారు. 80 శాతం లైసెన్సులు పునరుద్ధరించగా రూ. 36.32 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. నంద్యాల, కర్నూలు పరిధిలో 27 ఖాళీ దుకాణాలకు ఈ నెల 24 నుంచి అక్టోబర్ 1 అర్ధరాత్రి వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అక్టోబర్ 5న ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో డ్రా నిర్వహిస్తామన్నారు. రాజకీయాలు, సిండికేట్ల జోక్యాన్ని సహించబోమని, బెదిరింపులు ఎదురైతే జిల్లా అధికారి ఎస్. రవికుమార్‌ను 8008828467 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఏపీ ఎక్సైజ్ యాప్, ఏఐ ఆధారిత సీసీటీవీలతో నిఘా పెంచుతున్నట్లు నాగలక్ష్మి తెలిపారు

## రేకుల షెడ్లలో స్కూళ్లపై చర్యలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 30-: నిబంధనలకు విరుద్ధంగా రేకుల షెడ్లలో నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రత, మౌలిక వసతులు, అగ్నిమాపక, భవన భద్రతా ప్రమాణాలను తనిఖీ చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్, పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# హామీతో దీక్ష విరమణ--

### ఎంపీ బైరెడ్డి శబరి హామీతో నూనెపల్లె దీక్షలకు ముగింపు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 30-: నూనెపల్లె రైల్వే అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు శ్యామకాలువపై ఆర్‌అండ్‌బీ వంతెన విస్తరణ, ఆసుపత్రి?ఎన్‌జీవోస్ కాలనీ కూడలిలో సిగ్నల్ లైట్లు ఏర్పాటు, నూనెపల్లెలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఇచ్చిన హామీతో విరమించారు. మూడో రోజు దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఎంపీ శబరి ప్రజల సమస్యలను విన్నారు. రైల్వే అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, నష్టపరిహారం అంశాలపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కలెక్టర్ వద్ద సమావేశం నిర్వహించి సంబంధిత ఫైలును ముఖ్యమంత్రికి పంపిస్తామని, తాను మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో కలిసి ముఖ్యమంత్రిని కలిసి బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులు సాధించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యను పరిష్కరించడం తన బాధ్యత అని ఎంపీ స్పష్టం చేస్తూ దీక్ష విరమించాలని కోరారు. ఆమె హామీపై నమ్మకంతో అభివృద్ధి కమిటీ దీక్షలను విరమిస్తున్నట్లు ప్రకటించింది. అనంతరం ఎంపీ బైరెడ్డి శబరి దీక్ష చేస్తున్న వారికి స్వయంగా నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. కార్యక్రమంలో నూనెపల్లె అభివృద్ధి కమిటీ సభ్యులు, పెద్దలు, మేధావులు, వ్యాపారులు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెన్షనర్ల నిరసన--

### బకాయిలు చెల్లించాలని డిమాండ్--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 30: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నంద్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కె. రామసుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, పెన్షన్ సవరణ చేపట్టాలని, 50 శాతం కరువు భత్యాన్ని పెన్షన్‌లో విలీనం చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తదితర 12 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తోట రామయ్య, డి. గఫారు, వీకే మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమం

### స్కొచ్ అవార్డ్‌కు నామినేట్ కావడం సంతోషకరం

### కర్నూలు జిల్లాలో 1.98 లక్షల ఎకరాల్లో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, సెప్టెంబర్ 30:- జిల్లాలో అమలు చేస్తున్న ఖఓఆా కార్యక్రమం స్కాచ్ అవార్డ్స్‌కు నామినేట్ కావడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు..బుధవారం దేశ వ్యాప్తంగా స్కోచ్ అవార్డ్స్‌కు నామినేట్ చేసిన కలెక్టర్ లతో, వివిధ శాఖల డైరెక్టర్ లతో స్కోచ్ గ్రూప్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఖఓఆా కార్యక్రమాన్ని స్కోచ్ అవార్డ్స్‌కు నామినేట్ చేసిన నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లాలో అమలు చేసిన ఖఓఆా కార్యక్రమం వాటి ద్వారా సాధించిన ఫలితాల గురించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలానికి ముందే పొడి నేలల్లో వివిధ రకాల పంటల విత్తనాలను చిన్న చిన్న గుళికలు గా చేసి విత్తే ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున అమలు చేస్తు ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ స్కోచ్ గ్రూప్ ప్రతినిధులకు వివరించారు.. జిల్లాలో సుమారు 8 లక్షల హెక్టార్ల సాగుభూమిలో 75 శాతం వర్షాధార ప్రాంతం ఉండటంతో ఖఓఆా విధానాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.. ప్రస్తుతం జిల్లాలో 1,98,464 ఎకరాల్లో ఖఓఆా విత్తనాలు విత్తగా, 1,84,764 మంది రైతులు ఈ ఽా ం్ య ( ఽ్ వ ం ం లో భాగస్వాములయ్యారన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రచారంతో పాటు ఖఓఆా పొలాల్లో క్షేత్ర సందర్శనలు నిర్వహించి రైతులను ప్రోత్సహించినట్లు కలెక్టర్ తెలిపారు.. వర్షాధార ప్రాంతాల్లో రైతులకు పంట దిగుబడిని బట్టి 100 రోజులకు సగటున 12,500 నుంచి 20,500 వరకు, నీటిపారుదల ప్రాంతాల్లో 100 రోజులకు 19,500 నుంచి 26,000 వరకు ఆదాయం లభించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఖఓఆాలో ధాన్యాలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, పచ్చిరొట్ట పైర్లు, ఆకుకూరలు తదితర విత్తనాలను వినియోగిస్తారన్నారు. నీటిపారుదల ఉన్న ప్రాంతాల్లో కూరగాయలు, తీగజాతి పంటలను కూడా సాగు చేస్తారన్నారు. బహుళ పంటల విధానంతో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక పంటలను కలిపి సాగు చేయడం ద్వారా రైతులకు వివిధ దశల్లో ఆదాయం లభిస్తుందన్నారు.. ఖఓఆాలో విత్తనాల పెల్లెటైజేషన్ కీలకమైన ప్రక్రియ అని, పెల్లెటైజేషన్‌లో నాలుగు పొరలను ఉపయోగిస్తారన్నారు. మొదటి పొర - బీజామృతం, రెండో పొర ? క్లే కోటింగ్, మూడో పొర ? ఘనజీవామృతం, నాలుగో పొర ? బూడిద అని కలెక్టర్ వివరించారు..ఖఓఆా అమలు చేసిన రైతుల్లో సుమారు 250 విజయగాథలు నమోదైనట్లు కలెక్టర్ తెలిపారు. గూడూరు మండలం గూడూరు గ్రామానికి చెందిన జి. శేఖర్ 2.2 ఎకరాల వర్షాధార భూమిలో ఖఓఆా విధానాన్ని అనుసరించి మూడు నెలల్లో పశువుల మేత ద్వారా రెండు కోతల్లో రూ. 96,272 ఆదాయం పొందినట్లు కలెక్టర్ వివరించారు. బాజ్రా, కొర్ర, అలసందలు, నువ్వులు, ఆకుకూరలను అంతరపంటలుగా సాగు చేసి మరో రూ. 11,500 ఆదాయం పొందారన్నారు. మొత్తం స్థూల ఆదాయం సుమారు రూ. 1.07 లక్షలు కాగా, రూ. 10,000 పెట్టుబడి మినహాయించి సుమారు రూ. 97,000 నికర ఆదాయం పొందినట్లు కలెక్టర్ వెల్లడించారు.




# రెవెన్యూ లక్ష్యాలపై దృష్టి--

### బకాయిల వసూళ్లు వేగవంతం చేయాలి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 30: 2026?27 ఆర్థిక సంవత్సరానికి వివిధ శాఖలకు నిర్దేశించిన రెవెన్యూ లక్ష్యాలను సమన్వయంతో సాధించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ వసూళ్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖల వారీగా లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతి, బకాయిల వసూళ్ల పరిస్థితిని సమీక్షించారు .బకాయిల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ అంతరశాఖ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యాల సాధనకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వాణిజ్య పన్నులు, పోలీస్, గనులు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్, రవాణా, విద్య, ట్రెజరీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## లింగ నిర్ధారణ చేస్తే జైలుకే--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 30-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ డీఎల్ఎస్‌సీ కమిటీ సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శారదాబాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులు రద్దు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఆడబిడ్డలను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ శ్రవణ్‌కుమార్, జిల్లా విస్తరణ, మాస్ మీడియా అధికారి మల్లేపల్లి పామన్న, డాక్టర్ సలీమున్నీసా బేగం, బర్డ్ ఎన్జీవో ప్రతినిధులు వినయ్‌బాబు, వంశీ పాల్గొన్నారు.

## సకాలంలో గ్యాస్ డెలివరీ చేయాలి--

సెప్టెంబర్ 30: గ్యాస్ సిలిండర్లను వినియోగదారులకు సకాలంలో, నిర్ణీత సమయంలో డెలివరీ చేయాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గ్యాస్ ఏజెన్సీ డీలర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సివిల్ సప్లైస్ అధికారి రవిబాబు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని, ఐవిఆర్ఎస్ కాల్స్‌లో ప్రతికూల స్పందనకు తావులేకుండా చూడాలని సూచించారు. డెలివరీ సిబ్బంది వినియోగదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించేలా ఏజెన్సీలు పర్యవేక్షించాలని ఆదేశించారు. సేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.



## వీఆర్ఏల మోకాళ్లపై నిరసన-

-విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 30-తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకుల 15వ రోజు సమ్మె కొనసాగింది. సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం వీఆర్ఏలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నారాయణ మాట్లాడుతూ తెలంగాణ తరహాలో పే స్కేలు అమలు చేయాలని, వీఆర్ఏలకు వీఆర్వో పదోన్నతులు కల్పించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో అక్టోబర్ 1న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్ వద్ద అన్ని మండలాల వీఆర్ఏలు సహాయ నిరాకరణ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. అక్టోబర్ 2న తిరిగి తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఎర్ర బూరిగలు, మండల అధ్యక్షులు ఆకతర్ భాష, నగేష్, శేఖర్, మౌలాలి, విజయ్, శివలింగం, జయకృష్ణ, చెన్నయ్య, యశ్వంత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**